క్లుప్తంగా

విగ్రహావిష్కరణ



తంగళ్లపల్లి: మండలంలోని అంకుసాపూర్ గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ మంగళవారం ఆవిష్కరించారు. ఐలమ్మ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రమేశ్, ఎంపీటీసీ కుంటయ్య, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఆలయ ఉద్యోగులు

సిరిసిల్ల: రాజన్న ఆలయంలో మహా శివరాత్రి వేడుకలను హాజరుకావాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణకు ఆలయ అధికారులు ఆహ్వాన పత్రిక క్యాంపు కార్యాలయంలో అందించారు. ఈనెల 7 నుంచి 9వరకు మూడు రోజులపాటు వైభవంగా మహా శివరాత్రి జాతర జరగనుందని తెలిపారు. ఆలయ పర్యవేక్షకుడు మహేశ్, ఈవో సీసీశివ తదితరులు ఉన్నారు.

ఘనంగా మహాలింగార్చన



చందుర్తి : మండలకేంద్రంలోని శ్రీ హాలక్ష్మీదేవాలయం ఆవరణలో శివస్వాముల ఆధ్వర్యంలో నిర్వహించిన మహా లింగార్చనను మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛారణ మధ్య మహా లింగార్చన పూజ నిర్వహించారు. కార్యక్రమంలో శివస్వాములు, సతీశ్‌రావు, పులి సత్తయ్య, లింగాల తిరుమల్, మేడిశెట్టి మధు, పిట్టల బాబు, రాజు భక్తులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

బోయినపల్లి: కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 సిలిండర్ అమలు చేసిన సందర్భంగా మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, ఎంపీటీసీలు శ్రీనివాస్, అక్కెనపెల్లి ఉపేందర్, నాయకులు ఏనుగుల కనుకయ్య, బండి శ్రీను, బోయిని ఎల్లేశ్, జోగు రవీందర్, జంగం అంజయ్య, బాబు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మూడు దశాబ్దాలుగా ఏబీసీడీ వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం పట్టించుకోవడం లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్ష, కన్వీనర్లు ఖానాపురం లక్ష్మణ్, ఎలగందుల భిక్షపతి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. త్వరలో వర్గీకరణ సాధ్యమవుతుందన్నారు. ఈనెల 8న కరీంనగర్‌లో నిర్వహిస్తున్న పార్లమెంట్‌స్థాయి సమావేశానికి మంద కృష్ణమాదిగ హాజరవుతున్నారని, జిల్లాలోని ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలన్నారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ ఆవరణలో మందుబాబులు

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయ ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారుతోంది. మంగళవారం ఓ వ్యక్తి బొట్టుపెట్టే గ్లాసును తన చేతిలో పట్టుకుని మరో చేతితో భక్తుల మధ్యలోనే మద్యం తాగాడు. దీంతో భక్తులు సదరు వ్యక్తిని అక్కడినుంచి పంపించి వేశారు. ఆలయ ఆవరణలో భద్రతా లోపం కారణంగానే మిగతా భక్తులకు ఇబ్బందులు కలుగుజేస్తున్నారన్న అభిప్రాయాలున్నాయి. ఆలయ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

సిరిసిల్లలో నకిలీ బంగారం కలకలం

సిరిసిల్లక్రైం: సిరిసిల్లలోని నకిలీ బంగారం అలజడి మళ్లీ మొదలైంది. పట్టణంలోని గాంధీచౌక్ నుంచి బతకమ్మ తెప్పెవైపు వెళ్లే దారిలో టీస్టాల్ నిర్వాహకుడి వద్దకు చాయ్ తాగేందుకు ఓ వ్యక్తి రోజూ వచ్చేవాడు. హోటల్ వ్యక్తిని కొంత డబ్బు కావాలని ప్రాధేయడగా కొన్ని వస్తువులు ఖాతా పెట్టాలన్నాడు. తీసుకున్న అప్పు వేలకు చేరడంతో వెంటనే ఇవ్వాలని టీస్టాల్ యజమాని పట్టుపట్టాడు. తన వద్ద బంగారు చైన్ ఉందని, తీసుకొని రూ.లక్ష ఇవ్వాలని నమ్మబలకడంతో టీస్టాల్ నిర్వాహకుడు ఏకంగా రూ.లక్ష ఇచ్చినట్లు సమాచారం. తీరా ఆ బంగారు చైన్‌ను తెలిసిన వారికి చూపితే నకలిదని తెలిసింది. బాధితుడు సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వెనుదిరిగినట్లు తెలిసింది.

మూగజీవాల దాహార్తి తీరేదెలా ?

- నీటి వసతి కల్పించడంలో నిర్లక్ష్యం
- తాగునీటి కోసం అల్లాడుతున్న మూగజీవాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



భూక్యతండాలో పిచ్చిమొక్కల మధ్య నీటి తొట్టి

వీర్నపల్లి: మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటితొట్లు నిరుపయోగంగా మారుతున్నాయి. మండలంలో 17 గ్రామాల్లో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు 2009 నుంచి 2017 వరకు ఉపాధిహామీ పథకాల కింద నీటితొట్లు నిర్మించారు. ఒక్కో నీటి తొట్టి నిర్మాణానికి రూ.17వేల నుంచి రూ.20వేల వరకు ఖర్చుచేశారు. గ్రామం నుంచి ఉదయం మేతకు వెళ్లేటప్పుడు, తిరిగి ఇంటికి చేరేటప్పుడు పశువులు నీటిని తాగేందుకు వీలుగా గ్రామ శివార్లలో వీటిని నిర్మించారు. వీటి నిర్వహణ కొరవడి నిరుపయోగంగా మారాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు నీటి తొట్ల నిర్వహణను మర్చిపోయారు. కొన్నిచోట్ల ధ్వంసంకాగా మరికొన్ని చోట్ల చెత్తా చెదారంతో నిండి చెట్ల పొదల మధ్య కూరుకుపోయాయి. వేసవి దృష్ట్యా మూగజీవాలకు నీరులేక అల్లాడుతున్నాయి. చెరువులు, కుంటలు, బోరుబావుల వద్దకు నీటికోసం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

పలుచోట్ల శిథిలంగా..

నీటి తొట్ల నిర్వహణ బాధ్యతను గ్రామ పంచాయతీలు నిర్వహించాల్సి ఉన్నా చాలాచోట్ల పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోజూ నీటితో తొట్లు నింపాల్సి ఉండగా అలాంటి చర్యలేమీ చేపట్టడం లేదు. దాదాపు సగం తొట్ల వద్ద నీటివసతి లేదు. ఉన్నచోట బోరు మోటార్లు కాలిపోయి, నల్లా పైపులైన్లు పగిలిపోయాయి. ఇలాంటి సమస్యలతో పశువుల నీటితొట్లు పనికిరాకుండా పోతున్నాయి. ఏళ్ల తరబడి నిర్వహణ లేకపోవడంతో పలుచోట్ల శిథిలమైపోగా, కొన్ని పిచ్చి మొక్కలు, చెత్త, చెదారంతో దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో చెరువులు, కుంటలు నీరులేక ఎండిపోతున్నాయి. ప్రస్తుతం వేసవి ప్రారంభం కావడంతో పశువులు నీటికోసంఅటు ఇటూ తిరుగుతున్నాయి.

అధికారుల నిర్లక్ష్యంతోనే

వేసవిలో మూగజీవాల దాహం తీర్చేందుకు ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో రూ.లక్షలు వెచ్చించి నీటి తొట్లు నిర్మించారు. నీటి సౌకర్యం ఉన్న చోటనే తొట్లు నిర్మించామని అధికారులు చెబుతున్నా నీటివసతి కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. బోరు మోటార్లు చెడిపోయి, పైపులైన్ మరమ్మతులు చేయకపోవడం, విద్యుత్‌సౌకర్యం లేకపోవడంతో అవి తొట్లు అలంకారప్రాయంగా మారుతున్నాయి.

ధ్వంసమవుతున్నాయి



నీటి తొట్ల నిర్వహణను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ధ్వంసమవుతున్నాయి. నీటి కోసం మూగజీవాలు అల్లాడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు నీటి సౌకర్యం లేని వాటికి మిషన్ భగీరథ ద్వారా నీటి వసతి కల్పించాలి. శిథిలమవుతున్నా వాటికి మరమ్మతులు చేయాలి.

– జక్కుల లింబాద్రి, వీర్నపల్లి

పంచాయతీ కార్యదర్శులదే



ఉపాధిహామీ పథకంలో భాగంగా నిర్మించిన నీటి తొట్ల నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలదే. నిరుపయోగంగా మారిన వాటిని వినియోగంలోకి తెచ్చే విధంగా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీచేస్తాం. మరమ్మతులు, నీటి సౌకర్యం లేని విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– నరేష్‌కుమార్, ఎంపీవో, వీర్నపల్లి

రెడ్డి సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి



వెంకట్‌రెడ్డికి నగదు అందజేస్తున్న సభ్యులు

ఎల్లారెడ్డిపేట: రెడ్డిల సంక్షేమమే లక్ష్యంగా సమష్టిగా పనిచేస్తూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఎల్లారెడ్డిపేట ఉమ్మడి మండల రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండాడి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాచర్ల గొల్లపల్లికి చెందిన రెడ్డి సంక్షేమ సంఘం తరఫున సభ్యత్వాల రూపంలో రూ.1.28లక్షల నగదును మంగళవారం వెంకట్‌రెడ్డికి అందజేశారు.ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ..రెడ్డి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా హాస్టల్స్, రెసిడెన్సీ పాఠశాలలు, మండలంలోని అన్నిగ్రామాల్లో కమ్యూనిటీ హాల్స్, పండించిన పంటలకు గిట్టుబాటు ధర లాంటి ఎన్నో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ల్యాగల శ్రీనివాస్ రెడ్డి, నారాయణరెడ్డి, రాజిరెడ్డి, పద్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఎవరి మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడలేదు'

సిరిసిల్లటౌన్: తాను ఏ వర్గానికి చెందిన వారి మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడలేదని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తాను సందర్భోచితంగా చేసిన వ్యాఖ్యలు కొందరు వక్రీకరించారన్నారు. అయినా తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుంటున్నానన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ప్రకాశ్, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు, నాయకుడు గోలి వెంకటరమణ తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

పద్మశాలీలను తప్పుదోవ పట్టించొద్దు

సిరిసిల్లటౌన్: జిల్లాలో తమ సామాజిక వర్గాన్ని కించపరిచేలా కొందరు చేపడుతున్న చర్యలు మానుకోవాలని సిరిసిల్ల పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ కోరారు. మంగళవారం సంఘ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో పలువురు తమ సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేయగా..తాము సంయమనం పాటించి వారి విజ్ఞతకు వదిలేశామన్నారు. పద్మశాలీ మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, నాయకులు పంతం రవి, ఆడెపు చంద్రకళ, తాటిపాముల దామోదర్, కోడం అమర్, కోడం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు చైర్మన్‌ను కలిసిన నాయకులు

ఎల్లారెడ్డిపేట: రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్‌ను మంగళవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, నాయకులు కలిశారు. మైనార్టీల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలన్నారు. వక్ఫ్‌బోర్డు, కబరస్తాన్ భూములు, మసీదు సమస్యలు, మైనార్టీ పాఠశాలలకు సంబంధించిన అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సాహెబ్, షాదుల్, రఫీక్ తదితరులున్నారు.

హామీలను నెరవేరుస్తాం

చందుర్తి : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్ అన్నారు. మండలంలోని జోగాపూర్‌లో సుమారు రూ.17 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎంపీటీసీ సభ్యులు మ్యాకల గణేశ్‌తో కలిసి మంగళవారం భూమిపూజ చేశారు. మాజీ సర్పంచ్ నాగం రాజమల్లయ్య, పార్టీ మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గంభీరావుపేట: సముద్రలింగాపూర్ గ్రామశివారులో ఏఎస్సై బాపు ఆధ్వర్యంలో పోలీసులు పెట్రోల్ నిర్వహిస్తుండగా ద్విచక్రవాహనంపై అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు. కామారెడ్డి జిల్లా భవానిపేట తండాకు చెందిన అజ్మీర శ్రీనును అదుపులోకి తీసుకొని, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రూ. 10కి కిలో చొప్పున కొనుగోలు చేసి బీబీపేటలోని ఓ రైసుమిల్లులో కిలోకు రూ.15చొప్పున విక్రయిస్తున్నారని ఎస్సై తెలిపారు.

హనుమాన్ చాలీసా పారాయణం

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయ అనుబంధ దేవాలయమైన భీమన్న ఆలయంలో మంగళవారం రాత్రి హనుమాన్ చాలీసా పారాయణాలు కొనసాగాయి. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రొసీడింగ్స్ అందజేత

చందుర్తి: మండలకేంద్రంలోని శ్రీ మహాలక్ష్మీ ఆలయంలో అభివృద్ధి పనులకు నిధుల మంజూరు ప్రొసీడింగ్ పత్రాన్ని ఆలయ కమిటీ చైర్మన్ భాస్కర్‌కు కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు దారం చంద్రం, నాయకులు పులి సత్తయ్య మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మర్రి మల్లేశం, రాజు పిట్టల బాబు, తిరుపతి, కత్తి తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ముస్తాబాద్: మండలకేంద్రంలోని శివారులో పేకాటాడుతున్న ఐదుగురిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. పేకాడుతున్న ఐదుగురి నుంచి రూ.2700, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరంతా మండల కేంద్రానికి చెందిన వారిగా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గంజాయి విక్రేత..

రుద్రంగి: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. చందుర్తి సీఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన ఎండీ జమీర్ (19) కొంతకాలంగా ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు ఎండీ జమీర్ అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద గంజాయిని స్వాధీనం చేసుకొని ఎండీ జమీర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కిరణ్ కుమార్ వివరించారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ

సిరిసిల్లకల్చరల్: తంగళ్లపల్లి మండలం సారంపల్లి పెద్దమ్మ ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. పెద్దమ్మ ఆలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి హుండీ తాళం పగులగొట్టి అందులోని నగదు ఎత్తుకెళ్లారు. బోరు మోటారుకు సంబంధించిన వైర్, గుడిలోని సౌండ్‌సిస్టమ్ మైక్, గంట తదితర వస్తువులు దొంగిలించారు. రూ.లక్ష సొత్తుచోరీకి గురైనట్లు భావిస్తున్నారు.

అత్తింటివారిపై కేసు

గంభీరావుపేట: అదనపు కట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు. మండలంలోని రాజేశ్వర్‌రావునగర్ గ్రామానికి చెందిన మ్యాదరి స్వర్ణలతకు గతేడాది కామారెడ్డి జిల్లా బీబీపేటకు చెందిన మ్యాదరి నవీన్‌తో ప్రేమవివాహం జరిగింది. కొంతకాలం బాగానే ఉన్నా కొద్దిరోజులుగా నవీన్ అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని స్వర్ణలత పోలీసులకు ఫిర్యాదు చేసింది. నవీన్‌తోపాటు ఆయన సోదరుడు కాశయ్య, సోదరి రాజమణి, ఆమె కుమారులు భరత్, అభిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్వర్ణలత ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు..

పోలియో కేంద్రాల తనిఖీ

బోయినపల్లి: మండలకేంద్రంలోని శ్రీనగర్ కాలనీలో నిర్వహిస్తున్న పోలియో కేంద్రాలను ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, ఎంపీడీఓ బీమా జయశీలతో కలిసి తనిఖీ చేశారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఎంపీటీసీ సంబ బుచ్చమ్మ, వైద్యాధికారి రేణుక, సంబ లక్ష్మీరాజం, తదితరులున్నారు.

సంఘం భూమికి రక్షణ కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లిలోని సర్వే నెం.403 బి/1లో గల 17 గుంటల భూమిని యాదవ సంఘంకోసం గతంలో కొనుగోలు చేశామని, ఆ భూమికి మ్యుటేషన్ చేయకపోవడంతో కొందరు భూమిని కాజేందుకు కుట్ర పన్నుతున్నారని సంఘం సభ్యులు అన్నారు. గీస సతీశ్, గీస కొండయ్య, గీస శ్రీకాంత్ భూమిపై కన్నేసి, మ్యుటేషన్‌కు సహకరించకుండా వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు సంఘం సభ్యులు వేములవాడ రూరల్ తహసీల్దార్, పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. సంఘం సభ్యులు గీస మల్లయ్య, కొండవేని కిషన్, జక్కుల మహేశ్, లింగంపల్లి శ్రీనివాస్, గడ్డి రామస్వామి, శ్రీనివాస్, నక్క రాజయ్య తమభూమికి రక్షణ కల్పించాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక



సిరిసిల్లటౌన్: మాజీ వైస్ ఎంపీపీ చల్ల హరికృష్ణ సొంతగూటికి చేరుకున్నారు. మంగళవారం చిన్న బోనాలలో తనతో పాటు అనుచరులు 150 మందితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే.మహేందర్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. రగుడుకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు యాదగిరి కేకే సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ముఖ్య నాయకులు శివప్రసాద్, పాల్గొన్నారు.

కేకే దిష్టిబొమ్మ దహనం

సిరిసిల్లటౌన్: పద్మశాలీలపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ..కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల ఇన్‌చార్జి కే.కే మహేందర్‌రెడ్డి దిష్టిబొమ్మను మంగళవారం పద్మశాలీ యువజన సంఘం ఆధ్వర్యంలో దహనం చేశారు. సిరిసిల్ల పాతబస్టాండులోని నేతన్న చౌక్‌లో జరిగిన కార్యక్రమంలో కేకే వెంటనే తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షుడు గుండ్లపెల్లి పూర్ణచందర్, కౌన్సిలర్లు దార్ల సందీప్, అన్నారం శ్రీనివాస్, గెంట్యాల శ్రీనివాస్, నాయకులు బొల్లి రామ్మోహన్, గాజుల బాలయ్య, పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయానికి గ్రామంలోని శ్రీ కృష్ణయాదవ సంఘం ఆధ్వర్యంలో రూ. 51,111 అందజేశారు. గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో రూ. 30,016 , ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో రూ.33వేలు అందించారు.

ప్రమాదకర గుంత పూడ్చివేత



ఎల్లారెడ్డిపేట మండలంలోని పదిర వంతెనపై సిరిసిల్ల - కామారెడ్డి ప్రధాన రహదారిపై రోడ్డు మధ్యలోనే పెద్ద గుంత ఏర్పడింది. గుంతను పూడ్చాలని ప్రయాణికులు, వాహనదారులు అధికారులకు పలుసార్లు విన్నవించినా పట్టించుకోలేదు. నెలరోజుల వ్యవధిలో 15రోడ్డు ప్రమాదాలు జరగగా 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. రెండ్రోజుల క్రితం మోతె దేవదాస్ అనే వ్యక్తి తన ఎనిమిదేళ్ల కుమారుడితో ఆటోలో వెళ్తుండగా బోల్తాపడటంతో తీవ్రగాయాలయ్యాయి. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు స్పందించి తన సొంత ఖర్చుతో మంగళవారం గుంతను పూడ్చివేయించారు. ఈ సందర్భంగా పలువురు జెడ్పీటీసీకి కృతజ్ఞతలు తెలిపారు.

పద్మశాలీలపై వ్యాఖ్యలు చేస్తే సహించం



మాట్లాడుతున్న నాగుల శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: పద్మశాలీల ఆత్మగౌరవంపై నిరంతర పోరాటం చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఇటీవలే కాంగ్రెస్ నాయకుడు పద్మశాలీల ఆత్మగౌరవం దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడాన్ని సంఘం నాయకులు తప్పుబట్టారనీ, గతంలోనూ పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు వ్యాఖ్యలు చేసినప్పుడు ఇదే స్పందన కనబరిస్తే బాగుండేదన్నారు. పద్మశాలీలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని అన్ని పార్టీల నాయకులకు హెచ్చరించారు. బతుకమ్మ చీరల ఆర్డర్లలో అవకతవకలకు పాల్పడిన వారిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకుల ఎనగంటి నరేష్, కొండ సురేశ్, ఊరగొండ రాజు, మోర శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

నేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లటౌన్: సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్ల నేత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర పవర్ లూమ్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మూశం రమేశ్ డిమాండ్ చేశారు. తెలంగాణ చౌక్‌లో మంగళవారం ప్లకార్డులు ప్రదర్శించి మాట్లాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభం నుంచి గట్టెక్కేలా చర్యలు తీసుకోవాలని, బతుకమ్మ చీరలు, ఇతర ప్రభుత్వ ఆర్డర్లను వెంటనే ఇప్పించాలన్నారు. పరిశ్రమకు చెందిన అన్నిరంగాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసిన నేత కార్మికుల సంక్షేమానికి సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు నక్క దేవదాసు, సిరిమల్ల సత్యం, ఉడుత రవి, ఒగ్గు గణేశ్, మచ్చ వేణు, సురేస్, రవీందర్, సత్యం, వెంకటేశం, ప్రవీణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మూతబడ్డ పరిశ్రమను తెరిపించాలి



రిలేదీక్షలు చేపడుతున్న వస్త్ర పరిశ్రమ ఆసాములు

సిరిసిల్లటౌన్: కొద్ది రోజులుగా మూతబడిన సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను తెరిపించాలని ఆసాముల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్ అన్నారు. పనులు లేక అర్ధాకలితో ఉంటున్న ఆసాములు, కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ మంగళవారం బీవైనగర్‌లోని చేనేత, జౌళి శాఖ ఆఫీసు ఎదుట చేపట్టిన రిలేదీక్షలను ప్రారంభించి మాట్లాడారు. రెండ్రోజుల క్రితమే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి తమ పరిస్థితిని వివరించడం జరిగిందన్నారు. ప్రభుత్వం, యజమానుల నుంచి ఎలాంటి సహాయం అందక పనుల్లేక తమ కుటుంబాలు అర్ధాకలితో అలమటిస్తున్నాయని తెలిపారు. గత ప్రభుత్వం ఏటా బతుకమ్మ ఆర్డర్లు ఇచ్చి ఉపాధి కల్పించిందన్నారు. దీక్షల్లో నాయకులు చేర్యాల అశోక్, మండల రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు ఆరోగ్యంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కరీంనగర్‌కు చెందిన ప్రతిమ వైద్య సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్య నిపుణులు ఆరోగ్య సలహాలు ఇచ్చారు. నెలసరి సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గర్భాశయ క్యాన్సర్ నివారణకు వినియోగించే వ్యాక్సిన్, రొమ్ము క్యాన్సర్, రక్తహీనత, పౌష్టికాహారం గురించి వివరించారు. ప్రముఖ స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ బోయినపల్లి మాధవి, వైద్యులు పరిమల, మేఘన, ప్రిన్సిపాల్ విజయలక్ష్మీ, వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు, ఉపాధ్యాయినులు శ్వేత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బాలికా సాధికారతపై..



గంభీరావుపేట: మండలంలోని దమ్మన్నపేట మోడల్ స్కూల్ విద్యార్థులకు మంగళవారం బాలికా సాధికారతపై అవగాహన కల్పించారు. ఎస్సై రామ్మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని పలు అంశాలను వివరించారు. బాలల హక్కులు, బాల్య వివాహాలు, బాలకార్మికుల నిషేధం, లింగ సమన్వయం, సైబర్ క్రైం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేశ్, జీసీఈసీ కన్వీనర్ ప్రభావతి, నరసింహారాజు, పావని, సంగీత, చంటిబాబు, మహాలక్ష్మీ, హరీశ్, సురేందర్, రేణుక, జగదీశ్వర్, రిజ్వాన్, స్వామి, బాలచందర్, మంజుల, వెంకటేశ్, మారుతి, రవి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట: అందివచ్చిన అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. 1988–89 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు, ప్రస్తుత ఎన్నారైలు బొమ్మకంటి సతీశ్, అంబాదాస్, బొమ్మకంటి రుక్మయ్య, పోతు రమేశ్, ప్రధానోపాధ్యాయుడు తిరుమల మనోహరచారి మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ.25వేలతో కొనుగోలు చేసిన సౌండ్ సిస్టమ్‌ను ప్రధానోపాధ్యాయుడికి అందజేశారు. పూర్వ విద్యార్థులు నల్ల పర్శరాములు, వేణు, శ్రీనివాస్, సుదర్శన్, శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహేందర్‌రెడ్డిపై అసత్య ప్రచారం చేయొద్దు



మాట్లాడుతున్న నర్సయ్య

ఎల్లారెడ్డిపేట: సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిపై కొంతమంది తప్పుడు ప్రచారం చేయడం తగదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలోని పద్మశాలీల సంక్షేమానికి కృషిచేస్తున్నారన్నారు. పేద ప్రజల కోసం నిరంతరం పాటుపడే వ్యక్తి మహేందర్ రెడ్డి అన్నారు. మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, మధు, షకిల్, రాంచంద్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యం

సిరిసిల్లటౌన్: దివ్యాంగుల సంక్షేమానికే తమ స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తుందని ఐడియా సంస్థ సహా వ్యవస్థాపక అధ్యక్షుడు రాహుల్ సరిదెన అన్నారు. మంగళవారం సిరిసిల్లలోని ఓ ఫంక్షన్ హాల్‌లో దివ్యాంగుల వ్యవస్థాపక అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇప్పటి వరకు సంస్థ తరఫున దివ్యాంగులను 2030 వరకు పదివేల మందికి ఉద్యోగ అవకాశాలు, ఐదువేల మందికి వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి 60 మంది దివ్యాంగులకు వివిధ అంశాల్లో మూడు నెలల శిక్షణ ఇచ్చామని వారికి రూ. 22వేల నుంచి రూ. 25వేల వరకు వారివారి ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. సంస్థ ప్రతినిధులు గుండెల్లి వేణు, రాజు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

సిరిసిల్లటౌన్: సందేశ్ కాళీ సంఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు మారవేని రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతిపత్రం అందించి మాట్లాడారు.

పూలమొక్క అందజేత

వేములవాడ: వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు. రెవెన్యూ అంశాలు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన, తదితర వాటిపై కాసేపు చర్చించారు.

కాంగ్రెస్‌లోకి మరో కౌన్సిలర్ ?

- ఈనెల 7న వైస్‌చైర్మన్ ఎన్నిక

వేములవాడ: వేములవాడ మున్సిపల్ 25వ వార్డు కౌన్సిలర్ గూడూరి లక్ష్మి, ఆమె భర్త గూడూరి మధు బుధవారం ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలిసింది. బీఆర్ఎస్ ఉన్న గూడూరి మధు ఇటీవల నెలకొన్న పరిణామాలతో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలుస్తోంది. దీంతో వేములవాడ మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక రసవత్తరమైంది. ఒక్కొక్కరు కాంగ్రెస్ పార్టీలో చేరుతుండటంతో ముందుగా ఆశించిన విధంగా బీఆర్ఎస్ అభ్యర్థికి భంగపాటు తప్పేటట్లు లేదని సహచర కౌన్సిలర్లు చర్చించుకుంటున్నారు. కౌన్సిలర్లంతా బీఆర్ఎస్ నుంచి వైస్‌చైర్మన్‌కు పోటీ పడుతున్న మారం కుమార్ సారథ్యంలో గోవా ట్రిప్పు వెళ్లి వచ్చారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో వైస్‌చైర్మన్ ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం వాయిదా వేసింది. ఈనెల 7న వైస్‌చైర్మన్ ఎన్నికల నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్‌కు కలెక్టర్ ఆదేశించారు. దీంతో 7న వైస్‌చైర్మన్ ఎన్నిక జరగనుంది. ఎట్టకేలకు కాంగ్రెస్ నుంచి పోటీ పడుతున్న బింగి మహేశ్‌ను వైస్‌చైర్మన్ గిరి వరిస్తుందన్న చర్చ మొదలైంది.